సాక్షి మంచిర్యాల

శనివారం, 19, అక్టోబర్, 2024



ఎఫ్‌డీవో నియామకం ఎప్పుడో..
జన్నారం ఎఫ్‌డీవో పోస్టు ఖాళీగా ఉండడంతో పర్యవేక్షణ కరువైంది. మరోవైపు అటవీ డివిజన్‌లో స్మగ్లింగ్ పెరిగిపోతోంది. ఉన్న అధికారులైనా స్థానికంగా ఉండడం లేదు. 8లో▸



'కార్తీక వనం' కనుమరుగు
గత కొన్నేళ్లుగా పర్యాటకులతో కళకళలాడిన కార్తీకవనం(పార్కు)ను అటవీ శాఖ ఎత్తేసింది. ఆ పార్కును తిరిగి ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.0 /26.0
ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

డీపీఓ ఆకస్మిక పర్యటన



మొబైల్ యాప్ తీరును పర్యవేక్షిస్తున్న డీపీఓ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) డి.వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. మొబైల్ యాప్‌ను తనిఖీ చేసి అప్‌లోడ్ చేస్తున్న వివరాలను పరిశీలించి సూచనలు చేశారు. గ్రామంలోని పారిశుద్ధ్య కార్యక్రమాలు, కాంపోస్ట్ షెడ్, వర్మీ కాంపోస్ట్ తయారీని పరిశీలించారు. తడి, పొడి చెత్త వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్‌కు తీసుకువచ్చేలా గ్రామస్తులను చైతన్యం చేయాలన్నారు. ఈ నెల చివరి వరకు ఇంటి పన్నుల వసూళ్లు పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఎంపీఓ ఉమర్‌షరీఫ్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల పురోగతిపై నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి, ప్రణాళిక శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, నీటిపారుదల, టీజీఈడబ్ల్యూ, ఐడీసీ, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమశాఖల ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు తుది దశకు వచ్చాయని తెలిపారు. 100శాతం పూర్తి చేసిన పాఠశాలల బిల్లులు సమర్పిస్తే బిల్లులు మంజూరు చేస్తామని, మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనుల పురోగతిపై సమీక్షించారు.

అంగన్‌వాడీలో కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ



ఉడకబెట్టిన కోడిగుడ్లు

కోటపల్లి: మండలంలోని ఆలుగామ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన పల్లె శ్రావణ్ భార్య గర్భిణి కావడంతో గురువారం అంగన్‌వాడీ టీచర్ కోడిగుడ్లు పంపిణీ చేసింది. శుక్రవారం ఉడికించగా దుర్వాసన రావడంతో పరిశీలించారు. కోడిగుడ్లు కుళ్లిపోయినట్లు గుర్తించి అంగన్‌వాడీ కేంద్రం టీచర్‌ను శ్రావణ్ ప్రశ్నించాడు. తమకు వచ్చిన కోడిగుడ్లను పంపిణీ చేశామని టీచర్ చెప్పడంతో చేసేదేమీ లేక వెనుదిరిగాడు. కాగా, అంగన్‌వాడీ కేంద్రం వద్ద చిన్నారులకు కోడిగుడ్లు వండించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా అవి కూడా దుర్వాసన రావడంతో పడేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఐసీడీఎస్ సీడీపీవో మనోరమను సంప్రదించగా.. కుళ్లిన కోడిగుడ్ల విషయం తమ దృష్టికి రాలేదని, చెడిపోయిన కోడిగుడ్లను తొలగించి మంచివి అందిస్తామని తెలిపారు. కాగా, మండలంలో గత రెండు నెలల్లో ఇది నాలుగో ఘటన కావడం గమనార్హం. కుళ్లిన కోడిగుడ్లతో చిన్నారులు, బాలింతలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నా ఐసీడీఎస్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆగని కొట్లాటలు



మందపల్లి శ్రీనివాస్‌ను ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

- పోలీసులకు సమస్యగా గొడవలు
- వ్యక్తిగత, రాజకీయ కారణాలతో దాడులు
- వరుస ఘటనలతో శాంతిభద్రతలకు విఘాతం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో వర్గ కొట్లాటలు ఆగడం లేదు. ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలు పోలీసు అధికారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ఇకపై ఎక్కడా ఎలాంటి దాడులు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసు బాస్ విలేకరుల సమక్షంలో ప్రకటించారు. ఆయన ప్రకటించి 24గంటలు గడవక ముందే హాజీపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో మరో గొడవ జరగడం గమనార్హం. ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకోగా పోలీసులు కేసులు నమోదు చేశారు. తాజా ఘటనలో హాజీపూర్ మండల బీఆర్‌ఎస్ నాయకుడు మందపల్లి శ్రీనివాస్, మరో నలుగురు వ్యక్తుల మధ్య వివాదంతో పరస్పరం దాడులు చేసుకోగా, ఇరువర్గాలపై కేసులు నమోదయ్యాయి. ఇరువర్గాలు రాజకీయ, గ్రామ పరిధిలో నెలకొన్న పాత కక్షలే హత్యాయత్నం దాకా వెళ్లేందుకు ప్రధాన కారణంగా ప్రాథమికంగా గుర్తించారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద పోలీసు, ఇరువర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఇదే తరహాలో ఈ మండల పరిధిలో మరో గ్రామంలోనూ వ్యక్తిగత, రాజకీయ, ఆర్థిక కారణాలతో తగాదాలు కొనసాగుతున్నాయి.

తగాదాలకు రాజకీయ రంగు..

ఇటీవల జరిగిన ప్రతీ గొడవ రాజకీయ రంగు పులుముకుంటోంది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా, అంతకుముందు బీఆర్‌ఎస్ పార్టీ పరిపాలన సాగించింది. గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలు, నాయకుల మధ్య ఆధిపత్య పోరులో అనేక మంది నాయకుల్లో రాజకీయ వైరుధ్యాలు ఉన్నాయి. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో ఎన్నికల్లో గెలుపోటముల సమయంలో బయటపడ్డాయి. ఇక సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, చోటామోటా లీడర్ల మధ్య ఒకింత వైరం కొనసాగుతోంది. రాజకీయ ప్రేరేపితం కాకుండా, వ్యక్తిగతంగా ఉన్న కోపతాపాలు సైతం ప్రధాన పార్టీల మధ్య తగువుగానే మారుతోంది. ఈ క్రమంలో గతంలో బీఆర్‌ఎస్ హయాంలోనే గొడవలు జరిగాయని కాంగ్రెస్ నాయకులు చెబుతుంటే, కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాకే జరుగుతున్నాయని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. పరస్పర ఆరోపణలతో వ్యక్తిగత గొడవలు సైతం రాజకీయంగా మారుతున్నాయి.

పుల్‌స్టాప్ పడితేనే..

కారణమేదైనా గొడవల కారణంగా సమాజంలో అశాంతి రగిలే అవకాశం ఉంది. ప్రశాంత వాతావరణంలో అలజడి రేపే శక్తులను గుర్తించి ఎక్కడికక్కడ నిలువరించాల్సి ఉంది. విచ్చలవిడి మద్యం, గంజాయి, విందు, వినోదాలను అరికడితే నేర తీవ్రత తగ్గే అవకాశం ఉంది. అల్లర్లు చేసే వారిని గుర్తించడంపై ఎప్పటికప్పుడు పోలీసు శాఖ అప్రమత్తంగానే ఉంటోంది. ఇప్పటికే జిల్లాలో వేర్వేరు ఘటనల్లో 1477మందిని బైండోవర్ చేశారు. 65మంది అనుమానితుల జాబితా సిద్ధం చేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. గంజాయిపై ప్రత్యేక నిఘా ఉంచారు. కానీ వర్గ గొడవలను అదుపులోకి తీసుకు రాలేకపోతున్నారు. చాలామందికి చట్టంపై భయం లేకపోవడంతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. కేసుల పాలవుతున్నా మార్పు రాకపోగా, తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో రాజకీయ లబ్ధి కోసం తగాదాలు సృష్టించే నాయకులను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అధికార, విపక్షం తేడా లేకుండా చట్టం ముందు అందరినీ సమంగా చూడాల్సి ఉంది. ఇలాంటి ఘటనలకు పుల్‌స్టాప్ పడితేనే జిల్లా అభివృద్ధి ఆటంకం లేకుండా సాగనుంది.

ఎమ్మెల్యే ఇంట్లోకి అగంతకులు

ఈ నెల 14న గుర్తుతెలియని వ్యక్తులు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఇంట్లోకి చొరబడే ప్రయత్నం చేశారు. ముసుగులో ఉన్న వ్యక్తులను వాచ్‌మెన్ కేకలు వేస్తూ ప్రతిఘటించడంతో లోనికి వెళ్లకుండా పారిపోయారు. మరణాయుధాలతో ఎమ్మెల్యే ఇంటిపైకే వెళ్లిన వారెవరు? ఎందుకు వెళ్లారు? ఎమ్మెల్యేపైనే దాడి చేసే సాహసం చేశారా? అనేది ఆ వ్యక్తులు పట్టుబడితేనే వివరాలు తెలియాల్సి ఉంది. ఇందులో రాజకీయ కుట్ర ఉందా? లేదా ఏదైనా వ్యక్తిగత వైషమ్యం ఉన్నాయా? అనేది వెల్లడి కావాల్సి ఉంది. జిల్లాలో తొలిసారిగా అధికార పార్టీ ఎమ్మెల్యేపైనే దాడికి వెళ్లడంతో పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈ వ్యవహారంపై మూడు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేస్తున్నారు.

బెల్లంపల్లిలో సోలార్ పవర్‌ప్లాంటు



ఏఆర్ పోలీసు హెడ్‌క్వార్టర్స్ ఎదుట చదును చేసిన ఖాళీ స్థలం

- సింగరేణి యాజమాన్యం నిర్ణయం
- లీజు భూముల్లో సన్నాహాలు

బెల్లంపల్లి: బొగ్గు గనుల తవ్వకాలు, ఇతర అవసరాల కోసం ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకున్న భూమిని ఇతర అవసరాలకు వినియోగించేందుకు సింగరేణి యాజమాన్యం సిద్ధమైంది. మారుతున్న కాలానికనుగుణంగా కంపెనీ అవసరాలు, వాణిజ్యపరంగా వినియోగించాలనే లక్ష్యంతో ఖాళీ భూముల్లో సోలార్ పవర్‌ప్లాంటు ఏర్పాటుకు ముందుకొచ్చింది. బెల్లంపల్లిలో బొగ్గు గనులు మూతపడి రెండు దశాబ్దాలు కావస్తుండగా ఇప్పటివరకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించలేదు. తాజాగా సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణాలకు నడుం బిగించింది. ఇప్పటికే మందమర్రి ఏరియాలో సోలార్ పవర్ ప్లాంటు ఏర్పాటు చేయగా.. కొత్తగా బెల్లంపల్లి కేంద్రంగా ఏర్పాటుకు ప్రతిపాదించింది. ఈ మేరకు యుద్ధ ప్రాతిపదికన నిర్దేశించిన ఖాళీ స్థలాల్లో భూమి చదును పనులకు శ్రీకారం చుట్టింది. కంపెనీ తరఫున సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణంతో ఇప్పటివరకు స్తబ్ధుగా ఉన్న బెల్లంపల్లి ప్రాంతంలో సింగరేణి కార్యకలాపాలు మొదలయ్యే అవకాశాలున్నాయి.



బుధా గెస్ట్‌హౌజ్ ఆవరణలో చెట్ల తొలగింపు

67.5మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం..

మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల్లో దాదాపు 67.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి సింగరేణి యాజమాన్యం ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో సోలార్ ప్యానెళ్లు బిగించడానికి అవసరమైన చర్యలకు ఉపక్రమించింది. బెల్లంపల్లిలో దశాబ్దాల నుంచి పడావుగా ఉంటున్న ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసు హెడ్‌క్వార్టర్స్ ముందు ఉన్న దాదాపు 60 ఎకరాల భూమి, బుధా గెస్ట్‌హౌజ్ ఆవరణలో ఉన్న మరో 40 ఎకరాల్లో ఏర్పాటుకు గుర్తించింది. మందమర్రి ఏరియాలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో కలిపి మరో 100 ఎకరాల్లో ప్లాంటు నిర్మాణం చేపట్టాలని సంకల్పించినట్లు తెలుస్తోంది. బెల్లంపల్లి, మందమర్రి ప్రాంతాల్లో కలిపి 200 ఎకరాల విస్తీర్ణంలో సోలార్ పవర్‌ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి.

భూమి చదును పనులు

సింగరేణి బొగ్గు గనులకు పేలుడు పదార్థాల సరఫరా కోసం బెల్లంపల్లి ఆర్మ్‌డ్ రిజర్వుడు పోలీసు హెడ్‌క్వార్టర్ ముందు మ్యాగ్జిన్‌ను ఏర్పాటు చేశారు. ఆ మ్యాగ్జిన్ ముందు, చుట్టుపక్కల వేలాది ఎకరాల సింగరేణి లీజు భూమి పడావుగా ఉంటోంది. వాగులు, ఒర్రెలు, చెట్లు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి చిత్తడి వాతారణంతో ఉన్నాయి. బుధా గెస్ట్‌హౌజ్ ప్రధాన ద్వారం వద్ద నుంచి గెస్ట్‌హౌజ్ వెనుకాల వరకు ఉన్న ఖాళీ భూముల్లో వృక్షాలు ఏపుగా ఎదిగాయి. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో జేసీబీ, ట్రాక్టర్లతో చెట్లు, పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. భూమి చదును చేస్తూ వాగులు, వంకలను సమాంతరంగా తీర్చిదిద్దుతున్నారు. లీజు భూమిని తిరిగి ప్రభుత్వానికి అప్పగించకుండా అవసరాలకు అనుగుణంగా వినియోగించడానికి సింగరేణి యాజమాన్యం సిద్ధపడడం శుభ పరిణామంగా చెబుతున్నారు. ప్రతిపాదిత భూముల్లో సోలార్ పవర్‌ప్లాంట్ల ఏర్పాటుకు త్వరలోనే భూమి పూజ చేసే యోచనలో యాజమాన్యం ఉన్నట్లుగా తెలుస్తోంది.

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు



క్రికెట్ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్–17 బాల బాలికల క్రికెట్ ఎంపిక పోటీలు శుక్రవారం ముగిశాయి. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన పోటీలకు 102 మంది బాలురు, 20 మంది బాలికలు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలు ప్రకటించారు. చేతన్(ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల), సాత్విక్ సాయి(మిమ్స్), సుప్రీత్‌రెడ్డి (స్టేట్ స్కూల్), సాయిరాం(ట్రినిటీ), జహీర్(మోడల్‌స్కూల్), శ్రీహస్ పటేల్(మిమ్స్), అరున్ తేజ(రివిలేషన్), అభిరామ్(జెడ్పీఎస్‌ఎస్ జైపూర్), మహేశ్వర్(కేటీఎస్), సాత్విక్(బాయ్స్‌స్కూల్), రెహముద్దీన్(బాయ్స్‌స్కూల్), రెహన్‌ఖాన్(ట్రినిటీ స్కూల్), రూపక్(మోడల్‌స్కూల్ కాసిపేట), యశ్వంత్(ఆక్స్‌ఫోర్డు స్కూల్), సాత్విక్(ట్రినిటీ), హర్షవర్ధన్(బ్రిలియంట్ స్కూల్), విశ్వక్ తేజశ్రీ(శ్రీచైతన్యస్కూల్), కుందన్(సెయింట్ ఆంటోనీ) స్కూల్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పోటీల ఆర్గనైజర్ సిరంగి గోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు రేణి రాజయ్య, విఠల్, నందం శ్రీనివాస్, రవీంద్ర, వరలక్ష్మీ, దుబ్బ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 19న అండర్–17 బాలికల కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు తాండూర్ మండలం అచలపూర్ జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో నిర్వహిస్తామని ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ సీహెచ్.ఫణిరాజా తెలిపారు. వివరాలకు క్రీడల కన్వీనర్ ఉమాదేవి, ఆర్గనైజర్ సాంబమూర్తిలను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు ఖోఖో..

పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 19న జిల్లా పరిషత్ పాఠశాల నీల్వాయిలో అండర్–14 బాలికల ఖోఖో టోర్నమెంట్, ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఆరో తరగతి నుంచి 12వ తరగతిలోపు విద్యార్థులు అర్హులని, వివరాలకు ఆర్గనైజర్ దాసరి మల్లేశ్, టోర్నమెంట్ కన్వీనర్ గిరిధర్‌లను సంప్రదించాలని పేర్కొన్నారు.

'దండారి'కి కాకో ఆలయం ముస్తాబు



కాకో ఆలయం

దండేపల్లి: తెలుగు రాష్ట్రాల్లోనే ఏకైక ఆలయంగా ప్రసిద్ధి చెందిన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి ఒడ్డున ఉన్న ఆదివాసీల ఆరాధ్య దైవం పద్మల్‌పూరి కాకో ఆలయం దండారి ఉత్సవాలకు ముస్తాబైంది. ఆలయంలో శుక్రవారం ఉత్సవాలు ప్రారంభం కాగా.. దీపావళి అమావాస్యతో ముగుస్తాయి. మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలు, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి ఆదివాసీ గిరిజనులు యేటా వస్తుంటారు. ఆలయం వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంటుంది.

ఆదివాసీల ఆరాధ్యదైవం

పద్మల్‌పూరి కాకో అమ్మవారు ఆదివాసీ గోండు, ప్రదాన్, కొలాం, తోటి గిరిజనులకు ఆరాధ్య దైవం. దసరా తర్వాత ఆలయం వద్ద జరిగే దండారి ఉత్సవాలకు ఆదివాసీలు కుటుంబ సమేతంగా వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. విందు వంటకాలు చేసుకుని పంక్తి భోజనాలు చేస్తారు. పాయసంతోపాటుగా రుబ్బిన పెసరు, మినుము, బబ్బెర గారెలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. వీటిని గానుగతో తయారు చేసిన నువ్వులు, పల్లి నూనె వేసి తయారు చేస్తారు. దంచిన బియ్యంతో తయారు చేసిన అరిసెలు కూడా నైవేద్యంగా సమర్పిస్తారు. వీటికి సంబంధించిన ధాన్యాన్ని అరచేతితో కొలుస్తారు. మరికొందరు కోళ్లు, మేకలు కూడా బలిస్తారు.



కొలువుదీరిన పద్మల్‌పూరి కాకో

ఆకట్టుకునే గుస్సాడీల నృత్యాలు

ఆలయం వద్ద నిర్వహించే దండారి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా గుస్సాడీ నృత్యాలు పలువురుని ఎంతగానో ఆకట్టుకుంటాయి. నెత్తిన నెమలి పింఛంతో తయారు చేసిన టోపీ, కళ్లకు అద్దాలు, భుజాన జింక తోలు. నడుము, కాళ్లకు గజ్జెలు ధరించి చేతిలో కోలా పట్టుకుని గిరిజన వాయిద్యాలు, డప్పు చప్పుళ్లకు అనుగుణంగా గుస్సాడీలు చేసే నృత్యాలు చూపరులను ఎంతగానో అలరిస్తాయి. దండారి ఉత్సవాలు ముగిసేదాకా ప్రతీరోజు ఆలయం వద్ద ప్రత్యేక భజనలు చేస్తారు. గిరిజన భాషల్లో పాటలు పాడుతారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

- గ్రూప్–2, 3 నిర్వహణకు చర్యలు
- టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రూప్–2, 3 పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం నుంచి ఇతర కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో గ్రూప్ పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రూప్–2 పరీక్షలు డిసెంబర్ 15, 16న, గ్రూప్–3 పరీక్షలు నవంబర్ 17, 18న నిర్వహిస్తామని తెలిపారు. అధికారులు పరీక్షా కేంద్రాలు, స్ట్రాంగ్ రూములను గుర్తించి వసతులు, చర్యలపై వివరాలతో నివేదికలు అందించాలని ఆదేశించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ పరీక్షలకు జిల్లాలో 48 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, దాదాపు 15 వేల మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, ర్యాంపులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రశ్నపత్రాల భద్రతకు పోలీసు శాఖ సమన్వయంతో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసి భద్రతా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, పోలీస్ నోడల్ అధికారి సుందర్‌రావు, ఆర్సీ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దందాలు ఆగినందుకే దాడులు

- గూండాలు, రౌడీలను జైలుకు పంపక తప్పదు
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలఅగ్రికల్చర్: గత ప్రభుత్వ హయాంలో గూండాలు, రౌడీలను పెంచి పోషించడంతోనే అక్రమ దందాలు చేశారని, అవి అరికడుతున్నందుకే తన ఇంటిపై, అనుచరులపై దాడులు చేస్తున్నారని మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు విమర్శించారు. శుక్రవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 14న ముగ్గురు ముసుగు ధరించిన వ్యక్తులు తన ఇంటిపై దాడి చేసి వాచ్‌మెన్‌ను కొట్టారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆయన తనయుడు విజిత్‌రావు అండతో అనుచరులు, గూండాలు, రౌడీలు చెలరేగిపోయారని అన్నారు. గంజాయి, అక్రమదందాలు, భూ సెటిల్‌మెంటు, పోలీసుస్టేషన్‌లో పంచాయితీలు అరికడుతుండడంతో దాడులకు తెగబడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ గూండాలను దాడులకు పురమాయిస్తున్నాయని ఆరోపించారు. హంతకులు, గూండాలను ఎలా ప్రోత్సహిస్తున్నారని ప్రశ్నించారు. గత కొద్ది రోజులుగా నియోజకవర్గంలోని మండలాల్లో దాడులు చేస్తున్నారని అన్నారు. గంజాయి ఎవరు తెస్తున్నారు, అమ్మేది ఎవరు, గత కారకులు ఎవరో అందరికీ తెలుసని, వారి అక్రమ దందా, చరిత్ర మొత్తం తీసి జైలుకు పంపిస్తామని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ చైర్మన్‌లు రావుల ఉప్పలయ్య, వేణు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారంలో రాణించాలి

నెన్నెల: మహిళలు వ్యాపార రంగంలో రాణించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన చిలువేరు సాహితి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి తెలంగాణ రుచుల పేరిట పచ్చళ్లు, వివిధ రకాల పిండివంటలు చేస్తూ విక్రయిస్తోంది. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుంటూ దేశ విదేశాలకు కార్గో, కొరియర్‌ల ద్వారా పంపిస్తోంది. నెన్నెల తెలంగాణ గ్రామీణ బ్యాంకు, ఐకేపీ ద్వారా ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ కింద రూ.5లక్షల యూనిట్ మంజూరైంది. ఈ యూనిట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు సాహితిని ప్రత్యేకంగా అభినందించారు. పచ్చళ్లు, పిండివంటలతో మరికొందరు మహిళలకు ఉపాధి కల్పించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిషన్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళిమనోహర్, నెన్నెల బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది విక్రమ్, భాను పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు పిండి వంటల ప్యాకెట్ అందిస్తున్న సాహితి

క్లుప్తంగా

నకిలీ బంగారం ముఠా సభ్యుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: అంతర్రాష్ట్ర నకిలీ బంగారం ముఠా సభ్యుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఈనెల 6న పట్టణంలోని రాధాకృష్ణ లాడ్జిలో గల లెడ్జర్ బుక్‌లను ఎత్తికెళ్లిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించగా, శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా డోన్ మండలం కొత్తబుర్జుకు చెందిన మరో నిందితుడు ఎరుకల సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. కర్ణాటకలోని బళ్లారికి చెందిన మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు

డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు

మంచిర్యాలక్రైం: భూమి అమ్ముతానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్షతోపాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ మంచిర్యాల జడ్జి ఉపనిషద్వని శుక్రవారం తీర్పునిచ్చారు. సీఐ ప్రమోద్‌రావు కథనం ప్రకారం.. స్థానిక గౌతమినగర్‌కు చెందిన పాగిడి మునిరాజ్ 2012 జనవరి 31న ఉష్కమల్ల నారాయణకు చెందిన సర్వే నంబర్ 72/29లో 242 చదరపు గజాల భూమిని కొనుగోలు చేసేందుకు రూ.3.63 లక్షలకు అగ్రిమెంట్ కుదిరింది. డబ్బులు తీసుకున్న నారాయణ బాండ్ పేపర్‌పై రాసిఇచ్చాడు. కొన్ని రోజుల తర్వాత మునిరాజ్ మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి.. ఆ భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని నారాయణను కోరగా, బెదిరింపులకు పాల్పడ్డాడు. లక్ష్మి 2016 సెప్టెంబర్ 28న మంచిర్యాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై అశోక్ కేసు దర్యాప్తు చేశారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి, సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో జడ్జి ఈ మేరకు తీర్పునిచ్చారు.

షాపులో చోరీ



షటర్ తాళాలు పగులకొట్టిన దృశ్యం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో మోటార్ వైండింగ్ షాపులో గురువారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం షాపు షటర్ తాళం పగులగొట్టి ఉండడం చూసి యజమాని పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రూ.4 లక్షల విలువ గల 9 క్వింటాళ్ల రాగి తీగ ఎత్తుకెళ్లినట్లు సమాచారం.

తాళం వేసిన ఇంట్లో..

జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌లో తాళం వేసిన ఓ ఇంట్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పట్టణ ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. యజమాని భూమయ్య తన బంధువుల ఇంట్లో జరిగే వేడుకకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో 8 గ్రాముల బంగారం, 2 తులాల వెండి, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులు, యజమానికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎఫ్‌డీవో నియామకం ఎప్పుడో..!

- డివిజన్‌లో పెరుగుతున్న స్మగ్లింగ్
- సిబ్బంది కొరతతో సతమతం



ఇటీవల అటవీ అధికారులు పట్టుకున్న బెడ్



కవ్వాల్ సెక్షన్‌లో స్మగ్లర్లు నరికివేసిన టేకు చెట్లు (ఫైల్)

జన్నారం: అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ సిబ్బంది పనితీరును పర్యవేక్షించే జన్నారం ఎఫ్‌డీవో పోస్టు ఖాళీగా ఉంది. దీంతో జన్నారం అటవీ డివిజన్‌లో కలప స్మగ్లింగ్ పెరిగిపోతోంది. కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో నాలుగు డివిజన్‌లు ఏర్పాటు చేసి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పులుల ఆవాసానికి అనువైన ప్రదేశంగా ఉన్న జన్నారం అటవీ డివిజన్‌లో అధికారుల ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. జన్నారం అటవీ డివిజన్‌లో మూడు అటవీ రేంజ్‌లు, 13సెక్షన్‌లు, 40 అటవీ బీట్‌లు ఉన్నాయి. వీటితోపాటు అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ఒక ఫారెస్టు డివిజనల్ అధికారి(ఎఫ్‌డీవో) ఉన్నారు. గత ఏడాది అక్టోబర్‌లో ఎఫ్‌డీవో మాధవరావు హైదరాబాద్‌లోని ఆ శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. మంచిర్యాల డీఎఫ్‌వోకు బాధ్యతలు అప్పగించారు. ఆయన నిత్యం ప్రభుత్వ, శాఖపరమైన పనుల్లో తీరిక లేకుండా ఉండడం వల్ల అప్పుడప్పుడు డివిజన్‌కు వచ్చి వెళ్తుంటారు. దీంతో కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. గత ఎఫ్‌డీవో చేపట్టిన కార్యక్రమాలతో డివిజన్‌లో కలప స్మగ్లింగ్, వన్యప్రాణుల వేట తగ్గింది. కింది స్థాయి సిబ్బంది నిత్యం విధుల్లో ఉండేవారు. ఎఫ్‌డీవో బదిలీతో గతంలో చేపట్టిన కార్యక్రమాలు ఏడాది కాలంగా నిలిచిపోయాయి. కలప స్మగ్లింగ్ జరిగే జన్నారం అటవీ డివిజన్‌లో ఏడాదిగా రేంజ్ అధికారులు ఇన్‌చార్జిలుగా ఉండడం గమనార్హం. ఇందన్‌పల్లి రేంజ్ అధికారిగా మంచిర్యాల డీఆర్వో హఫీజొద్దీన్ నాలుగేళ్లుగా పని చేసి లక్సెట్టిపేటకు బదిలీపై వెళ్లారు. జన్నారం రేంజ్ అధికారి సెలవుపై వెళ్లడంతో కొన్ని రోజులు ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హఫీజొద్దీన్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరించగా.. ప్రస్తుతం తాళ్లపేట్ రేంజ్ అధికారి సుష్మారావు ఇన్‌చార్జి రేంజ్ అధికారిగా ఉన్నారు.

స్థానికంగా ఉండని అధికారులు

జన్నారం అటవీ డివిజన్‌లోని కవ్వాల్ అటవీ సెక్షన్‌లో అధికారులు స్థానికంగా ఉండడం లేదు. ఈ సెక్షన్‌లో నాలుగు అటవీ బీట్‌లు ఉన్నాయి. విస్తీర్ణం, స్మగ్లింగ్ పరంగా పేరుంది. గతంలో సెక్షన్ అధికారి కవ్వాల్ సెక్షన్‌కు డీఆర్వోను నియమించారు. డీఆర్వోగా బాధ్యతలు చేపట్టిన హేమలత 15రోజులకే సెలవుపై వెళ్లారు. నలుగురు బీట్ అధికారుల్లో ఇద్దరు సెలవుపై వెళ్లడంతతో ప్రస్తుతం ఒక ఇన్‌చార్జి సెక్షన్ అధికారి, ఇద్దరు బీట్ అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో బీట్ అధికారి ప్రణయ్ డీఎస్సీలో ఎంపిక కాగా.. ఆయన కూడా ఈ ఉద్యోగాన్ని వదిలి ఉపాధ్యాయ పోస్టులో చేరే అవకాశం ఉంది.

మే నుంచి అక్టోబర్ వరకు

ఈ ఏడాది మే నుంచి అక్టోబర్ వరకు డివిజన్‌లో పలు ప్రాంతాల నుంచి కలప తరలించగా అధికారులు పట్టుకున్నారు. మచ్చుకు కొన్ని సంఘటనలు మేలో కవ్వాల్ అటవీ సెక్షన్ రాయికుంట బీట్‌లో స్మగ్లర్లు టేకు చెట్లను రంపంతో కోసి దుంగలను తీసుకెళ్లగా ఒకరిని గుర్తించి కేసు చేశారు.

- జూన్ 1న పడిపెల్లి బీట్‌లో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న రెండు టేకు చెట్లను రంపంతో కోయగా విద్యుత్ తీగలపై పడి మంటలు లేవడంతో రంపం, కలప అక్కడే వదిలి వెళ్లారు. ఈ సంఘటనలో ఇద్దరిపై కేసు చేశారు.
- జూన్ 6న కలప స్మగ్లింగ్ ఆరోపణలపై వెద్మ లక్ష్మణ్‌ను అరెస్ట్ చేశారు.
- జూలై 25న కిష్టాపూర్ గ్రామంలో కుల్యకాయల మల్లేశ్ ఇంట్లో సోదాలు చేసి రూ.8,463 విలువైన కలప పట్టుకున్నారు.
- ఆగస్టు 21న కిష్టాపూర్ గ్రామంలో గాజుల మల్లేశ్ ఇంట్లో రూ.15 వేలు విలువైన 11 టేకు చెక్కలు, 4 దిమ్మెలు పట్టుకున్నారు.
- ఆగస్టు 2న తాళ్లపేట్ అటవీ రేంజ్ ఊట్ల బీట్ పరిధిలో అటవీశాఖ అధికారులు వెంబడించి రూ.34 వేల విలువైన 3 టేకు సైజులు 8 వాసాలు పట్టుకున్నారు.
- సెప్టెంబర్ 23న జన్నారం మండల కేంద్రంలోని శ్రీలంక కాలనీలో రూ.14 వేలు విలువైన నిల్వ ఉన్న కలప పట్టుకున్నారు.

వీటి ఆధారంగా పట్టుబడకుండా ఎంతో కలప తరలిపోతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఉన్నత అధికారులు దృష్టి సారించి ఎఫ్‌డీవో నియామకం చేసి, పెరుగుతున్న స్మగ్లింగ్ నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెరుగుతున్న స్మగ్లింగ్

జన్నారం అటవీ డివిజన్‌లో గతంతో పోలిస్తే స్మగ్లింగ్ పెరుగుతోంది. ఇటీవల పలు ప్రాంతాల్లో అధికారులు కలప పట్టుకున్న సంఘటనలే నిదర్శనం. డివిజన్‌లోని కవ్వాల్ సెక్షన్, మహ్మదాబాద్, తాళ్లపేట్ రేంజ్‌లోని పలు ప్రాంతాల నుంచి స్మగ్లింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. మహ్మదాబాద్ సెక్షన్‌లోని పలు ప్రాంతాల్లో స్మగ్లర్లు అధికారుల కళ్లుగప్పి కలప తరలిస్తున్నారు. అటవీ ప్రాంతాల నుంచి చింతగూడెం సమీపం నుంచి గోదావరి దాటిస్తున్నట్లు సమాచారం. గోదావరి ప్రాంతాలైన తపాలపూర్, రాంపూర్, చింతగూడ గ్రామాల గుండా కొందరు గుట్టు చప్పుడు కాకుండా కలప తరలిస్తున్నారు. కవ్వాల్ సెక్షన్ నుంచి ద్విచక్ర వాహనాల ద్వారా తరలిస్తున్నట్లు తెలిసింది. కొందరు వ్యక్తులు ఎడ్లబండ్ల ద్వార దుంగలను తరలిస్తూ రాత్రికి రాత్రే మిషన్ల ద్వారా కోయిస్తున్నారు. కాగా, ఎఫ్‌డీవో నియామకంపై కవ్వాల్ టైగర్‌జోన్ ఎఫ్‌డీపీటీ శాంతారాంను సంప్రదించగా.. ఫారెస్ట్ డివిజన్ అధికారి బదిలీలు, నియామకాలు ప్రభుత్వం చేతిలో ఉంటాయని, త్వరలో నియామకం అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

అధిక సాంద్రత సాగుతో లాభాలు అధికం



రైతులకు అవగాహన కల్పిస్తున్న శివకృష్ణ, సునీల్ మహాజన్

బెల్లంపల్లిరూరల్: పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతి పాటించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ, జాతీయ పత్తి పరిశోధనసంస్థ నాగ్‌పూర్ ప్రధాన శాస్త్రవేత్త సునీల్ మహాజన్ అన్నారు. మండలంలోని మాల గురిజాల శివారులో అధిక సాంద్రత పద్ధతి ద్వారా రైతులు సాగు చేస్తున్న పత్తి పంటలను శుక్రవారం సందర్శించారు. సాగులో తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 425 ఎకరాల్లో రైతు క్షేత్ర ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, రైతులు ఉన్నారు.

కల్వర్టును ఢీకొన్న వాహనం

భైంసారూరల్: భైంసా–బాసర ప్రధాన రహదారిపై దేగాం సమీపంలో వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వాస్టర్ సాయినాథ్ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు..భైంసాలోని భట్టిగల్లీకి చెందిన డ్రైవర్ వాస్టర్ సాయినాథ్ (34) శుక్రవారం భైంసా నుంచి యూరియా బస్తాలతో వాహనంలో బాసరకు వెళ్తున్నాడు. ఈక్రమంలో కల్వర్టును ఢీకొనడంతో సాయినాథ్ సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియాసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్నిరంగాల్లో అగ్రగామిగా ట్రిపుల్‌ఐటీ

- ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్



క్యాంపస్‌లో అధికారులతో మాట్లాడుతున్న వీసీ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. బాసర ట్రిపుల్‌ఐటీకి శుక్రవారం చేరుకున్న ఆయనకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగీ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం క్యాంపస్‌లోని వీసీ చాంబర్‌లో వర్సిటీ స్థితిగతులపై ప్రొఫెసర్ గోవర్ధన్ సమీక్ష నిర్వహించారు. అనంతరం మెస్‌లను పరిశీలించారు. డైనింగ్‌హాల్, కిచెన్, స్టోర్‌రూంలను పరిశీలించారు. పరిశుభ్రతతోపాటు మెస్‌లలో వినియోగించే వస్తువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పరిపాలన భవనంలో అసోసియేట్ డీన్స్, స్టూడెంట్ వెల్ఫేర్ అధికారులతో సమావేశమయ్యారు. ట్రిపుల్‌ఐటీలో పోస్టుల వివరాలు, అకడమిక్ క్యాలెండర్, వసతి గృహాల వివరాలు, విద్యార్థుల సంఖ్య ఇలా పలు అంశాలను అడిగితెలుసుకున్నారు. ట్రిపుల్‌ఐటీలో సాంకేతిక విద్యతోపాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తు విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీసి అందుకు అవసరమయ్యే నూతన కోర్సులు ప్రవేశపెడతామని తెలిపారు. విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. ప్రభుత్వంతో సంప్రదించి పెండింగ్ పనులు ఉంటే పూర్తిచేయిస్తామని పేర్కొన్నారు. ట్రిపుల్‌ఐటీలో ఫైనాన్స్ సెక్షన్, స్కాలర్‌షిప్ సెక్షన్, అకడమిక్ సెక్షన్, స్టూడెంట్ వెల్ఫేర్ సెక్షన్, లైబ్రేరీతోపాటు పలు సెక్షన్‌లలో తనిఖీల గురించి అడిగితెలుసుకున్నారు. ట్రిపుల్‌ఐటీలో సమస్యలు పరిష్కరించడమే తన ముందు ఉన్న ప్రధాన లక్ష్యమని తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

- 1.5 కిలోల గంజాయి, ఒక వ్యాన్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: వివిధ ప్రాంతాలకు గంజాయి తరలిస్తున్న కేసులో నలుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ సీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాలతో గతనెలలో తలమడుగు పోలీసుస్టేషన్ పరిధిలో మహారాష్ట్రతో అనుసంధానంగా ఉన్న లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ వద్ద భారీఎత్తున గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఆ కేసులో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలోని బుల్దాన జిల్లాకు చెందిన గోతిరాం గురుదయాల్ సాబ్లే, శుభం గోతిరాం సాబ్లే, అమర్‌సింగ్ నారాయణ గోతి, సోమనాథ్ బికా అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి, ఒక వ్యాన్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న ఆదిలాబాద్ రూరల్, జైనథ్ సీఐలు ఫణీధర్, సాయినాథ్, ఎస్సై ముజాహిద్, పోలీసు సిబ్బంది రుక్మారెడ్డి, గంగాధర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులను ఎస్పీ అభినందించి, నగదు పురస్కారం ప్రకటించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



డివైడర్ ఎక్కిన లారీ

బెల్లంపల్లి: హైదరాబాద్–చంద్రపూర్ నేషనల్ హైవే 363పై రోడ్డు ప్రమాదం త్రుటిలో తప్పింది. గురువారం సాయంత్రం ఆసిఫాబాద్ వైపు నుంచి మంచిర్యాలకు లారీ వెళ్తోంది. బెల్లంపల్లి బైపాస్ వద్ద లారీ టైర్ పగిలి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ సమయంలో వాహనాలేవి రాకపోవడంతో ప్రమాదం తప్పింది. టూటౌన్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ కోసం నేషనల్ హైవే అధికారులకు సమాచారం అందజేశారు. శుక్రవారం కొత్త టైర్ మార్చి లారీని తీసుకువెళ్లారు.

అదుపుతప్పి లోయలో పడ్డ కారు



బోల్తాపడ్డ కారు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్‌కే ఓసీ, అమరవాది చెరువు సమీపంలో శుక్రవారం ఓ కారు అదుపుతప్పి చిన్న లోయలో పడింది. పట్టణానికి చెందిన కిరణ్ శ్రీరాంపూర్ నుంచి ఆర్‌కేపీకి వస్తుండగా కారు అదుపుతప్పి స్తంభాన్ని వేగంగా ఢీకొని లోయలో పడిపోయింది. కాగా, కిరణ్‌కు ప్రాణాపాయం తప్పింది.

రాపల్లిలో పరస్పర దాడులు

- మంచిర్యాల ప్రైవేట్ ఆస్పత్రిలో నాటకీయ పరిణామాలు
- ఇరువర్గాల్లో పలువురికి గాయాలు, చికిత్స



మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



గాయపడిన శ్రీనివాస్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇరువర్గాలపై జరిగిన దాడులకు రాజకీయ రంగు పులుముకుంది. శుక్రవారం హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ నేత, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకుల మధ్య జరిగిన పరస్పర దాడులు చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ ఉదయం రాపల్లి వైపు వెళ్తుండగా పునరావాస కాలనీ సమీపంలో తంగెళ్ల రమేశ్, తంగెళ్ల సాగర్, దేనవేణి రాజశేఖర్‌లకు మధ్య గొడవ జరిగింది. శ్రీనివాస్ రోడ్డుకు కారు అడ్డంగా పెట్టడం, తమ బైక్ ఢీకొనడం వల్ల తమకు గాయాలయ్యాయని ఇరువర్గాల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఒకరిపై ఒకరు చేసుకున్న దాడుల్లో ఇరువురికి గాయాలు కాగా మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆయన్ను పరామర్శించారు. శ్రీనివాస్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో పోలీసులకు సహకరించినా పార్టీ కార్యకర్తలు అడ్డుకునే క్రమంలో తోపులాట చోటు చేసుకుంది. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాస్ గురించి ఆరా తీయగా తీసుకురాలేదని చెప్పడంతో అంతా కంగుతిన్నారు. చివరకు లక్సెట్టిపేట కోర్టుకు తరలించనట్లు తేలడంతో తదుపరి చర్యలకు ఉపక్రమించారు. కాగా, తన భర్త శ్రీనివాస్‌పై అన్యాయంగా దాడి చేసి గాయపర్చారని మాజీ ఎంపీపీ స్వర్ణలత అన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మరోవర్గం బాధితులు

పరస్పర దాడిలో గాయపడిన మరోవర్గం బాధితులు తంగెళ్ల రమేశ్, తంగెళ్ల సాగర్, దేనవేణి రాజశేఖర్ మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను కాంగ్రెస్ నాయకులు తోట రావు, శ్రీనివాసగౌడ్, సతీశ్‌రావు, దొమ్మటి సత్తయ్య, బొడ్డు శంకర్ తదితరులు పరామర్శించారు. దాడి ఘటనపై బాధితులు ఫిర్యాదు చేశారు.

ఇరువర్గాలపై కేసులు

ఇరువర్గాల వారు ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై చాంద్ తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్‌పై 109, 307, 324, రెడ్ విత్ 34 సెక్షన్ నమోదు కాగా, తంగెళ్ల రమేశ్, సాగర్, దేనవేని రాజశేఖర్‌లపై 324, రెడ్ విత్ 34 సెక్షన్ నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..రాపల్లి గ్రామానికి చెందిన తంగెళ్ల రమేశ్, తంగెళ్ల సాగర్, దేనవేని రాజశేఖర్‌ల మధ్య పాత గొడవలు కక్షల కారణంగా మాజీ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్ తన కారుతో వారిని అడ్డగించి ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. ఇందులో తంగెళ్ల రమేశ్ కాలు విరిగిపోగా రాజశేఖర్, సాగర్‌కు గాయాలయ్యాయి. అయితే వీరి దాడిలో శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి.

కడుపునొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్య



లింగయ్య (ఫైల్)

దండేపల్లి: కడుపునొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కాసిపేటకు చెందిన చిరుత లింగయ్య(44)కు గత రెండేళ్ల క్రితం లివర్ చెడిపోవడంతో ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. కొన్నిరోజులు బాగానే ఉన్న అతనికి ఈ మధ్య కడుపునొప్పితో బాధపడుతున్నాడు. స్థానికంగా చికిత్స చేయించుకున్న నయం కావడం లేదు. పెద్ద ఆసుపత్రికి వెళ్దామంటే ఆర్థికంగా ఇబ్బందులు ఉండటం, తీవ్ర మనస్తాపంతో శుక్రవారం తెల్లవారుజామున గడ్డిమందు తాగి వాంతులు చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం లక్సెట్టిపేటకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య సుజాత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..



మృతుడి వివరాలు సేకరిస్తున్న ఏఎస్సై పోశెట్టి

వాంకిడి: మద్యానికి బానిసై వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై పోశెట్టి కథనం ప్రకారం..మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన మస్నే రావుజి(45) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. డబ్బులు లేని సందర్భాల్లో ఇంట్లో వస్తువులు అమ్మి మద్యం కొనుగోలు చేసుకునేవాడు. కుటుంబ సభ్యులు ఎంత సముదాయించినా మార్పు రాలేదు. ఈక్రమంలో గురువారం సాయంత్రం జీవితంపై విరక్తితో రావుజి.. పశువుల కొట్టంలో పురుగుల మందు తాగి వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. భార్య మస్నే సునీత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

తాంసి మండలంలో ఒకరు..



మృతదేహన్ని పరిశీలిస్తున్న తాంసి ఎస్సై శివరాం

తాంసి: పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని వడ్డాడి వద్ద మత్తడివాగు ప్రాజెక్టు సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై శివరాం కథనం ప్రకారం..ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన చౌడారపు హరికృష్ణ (27) గత కొంతకాలంగా మానసిక వ్యాధి తో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం ఆలయానికి వెళ్తున్నానని ఇంట్లో వారికి చెప్పి బైక్‌పై బయల్దేరాడు. మత్తడివాగు ప్రాజెక్టు వద్ద చేరుకుని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి అందించిన సమాచారంతో ఎస్సై అక్కడికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. తల్లి అరుణ పిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, మృతుడి సోదరుడు సాయికృష్ణ 2019లో మత్తడివాగు ప్రాజెక్టు వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

జీవితంపై విరక్తితో ఒకరు

ఆదిలాబాద్‌టౌన్: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై అశోక్ కథనం ప్రకారం..ఖుర్షాపూర్‌కు చెందిన హన్మాండ్లు (35)కు తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. సంతానం కావడం లేదని భార్య రెండేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుంది. దీంతో మనోవేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి రాములు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..



దోంగ్రే సచిన్(ఫైల్)

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన యువకుడు దోంగ్రే సచిన్ ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై రాందాస్ కథనం ప్రకారం.. సచిన్ (29) మద్యానికి బానిసయ్యాడు. పైగా అప్పులు చేసి తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్లాబ్‌కు నైలాన్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మౌనిక ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి



షేక్ అహ్మద్ మృతదేహం

ముథోల్: మద్యానికి బానిసై వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఆత్మహత్య కు పాల్పడినట్లు ఏఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని తరోడా గ్రామానికి చెందిన షేక్ అహ్మద్(50) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.